www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 సెప్టెంబర్ 2023

5

ఏలూరు

## 15న 'ఎంప్లాయ్ గ్రీవెన్స్' : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఉద్యోగుల నుండి ఫిర్యాదులను స్వీకరించేందుకు ఎంప్లాయి గ్రీవెన్స్‌ను ఈ నెల 15వతేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన గ్రీవెన్స్‌లు ఏమైనా ఉంటే వాటిని దరఖాస్తులో పొందుపరచి తమ సిఎఫ్ఎంఎస్ ఐడి, ఎంప్లాయ్ గుర్తింపు నెంబరుతో 'ఎంప్లాయి గ్రీవెన్స్'కు హాజరు కావాలన్నారు.

# అంగన్‌వాడీల గోడుపట్టదా..!

**రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం**

**అందని బెనిఫిట్లు, వృద్ధాప్య పింఛను**

**ఇంటి అద్దెలు, కరెంటు బిల్లుల కోసం ఎదురుచూపులే**

**వేరే ప్రాజెక్టులో విలీనమైన కేంద్రాల పరిస్థితి అగమ్యగోచరం**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంగన్‌వాడీల సమస్యలు పాలకులకుగానీ, అధికారులకుగానీ పట్టడం లేదు. దీంతో అంగన్‌వాడీల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. రెండు జిల్లాలో 3,911 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 7,352 మంది వర్కర్లు, ఆయాలు పనిచేస్తున్నారు. అన్ని పనులకు అంగన్‌వాడీ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్న ప్రభుత్వం, వారి సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉద్యోగులకు బెనిఫిట్ కింద వర్కర్లకు రూ.50 వేలు, ఆయాలకు రూ.20 వేలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీలకు ఈ సొమ్ములు సకాలంలో ఇవ్వడం లేదు. ఏలూరు జిల్లాలోనే ఈ విధంగా బెనిఫిట్స్ సొమ్ము అందాల్సిన ఉద్యోగులు వందమందికిపైగా ఉన్నట్లు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈవిధమైన సమస్యతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీలు స్కీమ్ వర్కర్ల పరిధిలోకి వస్తారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా పేర్కొంటూ ప్రభుత్వ పథకాలను నిలిపివేసింది. దీంతో రూ.11 వేలు మాత్రమే జీతం తీసుకుంటున్న అంగన్‌వాడీలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సైతం నష్టం కలిగించేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆ ఉద్యోగుల వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఈ పని సక్రమంగా చేయడం లేదు. దీంతో ఉద్యోగ విమరణ పొందిన ఉద్యోగులు వృద్ధాప్య పింఛనకు దరఖాస్తు చేసుకున్నా రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తుందంటూ దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. ఐసిడిఎస్, డిఆర్‌డిఎ అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందంటూ అంగన్‌వాడీలు లబోదిబోమంటున్నారు. ఈ విధంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు ఏలూరు జిల్లాలోనే దాదాపు 270 మందికిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. సచివాలయాల్లో మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నా, ఆచరణలో మాత్రం జరగడం లేదు.

**బిల్లుల కోసం పడిగాపులు**

అంగన్‌వాడీకేంద్రాల ఖర్చుల బిల్లులను సైతం ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె కేంద్రాల్లో నడిచే అంగన్‌వాడీ సెంటర్లకు మున్సిపాలిటీల్లో రూ.నాలుగు వేలు, పట్టణాల్లో రూ.ఆరు వేలు, గ్రామాల్లో రూ.రెండు వేలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గడిచిన ఐదునెలలుగా కేంద్రాల అద్దెలకు సంబంధించిన బకాయిలు ఇవ్వడం లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు బిల్లుల బకాయిలు రెండేళ్లుగా ఇవ్వడం లేదు. కూరగాయలు, వంటగ్యాస్, రవాణా బకాయిలు వంటివి నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు. దీంతో అంగన్‌వాడీ ఉద్యోగులు సొంత సొమ్ములు ఖర్చుచేయలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇక గర్భిణులకు, బాలింతలకు సంబంధించిన వివరాలను ఫోన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఫోన్లు పనిచేయక, చీటికీమాటికీ వెర్షన్లు మార్చడంతో ఉద్యోగులు నలిగిపోతున్నారు. ఫోన్ సమస్యలను ఏఒక్కరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా జిల్లాల విభజనతో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను వేరే ప్రాజెక్టులో విలీనం చేశారు. అందులో భాగంగానే పోలవరం మండలానికి సంబంధించిన 78 కేంద్రాలను కొయ్యలగూడెం ప్రాజెక్టులో కలిపారు. విలీనమైన కేంద్రాల వివరాలు ప్రాజెక్టుకు చేరలేదంటూ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలా అనేక సమస్యలతో అంగన్‌వాడీ సిబ్బంది ఆర్థికంగా నలిగిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అంగన్‌వాడీలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పనులు పరిశీలిస్తున్న చక్రధరబాబు

## పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు వేగవంతం

**ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్.చక్రధరబాబు**

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులను మరింత వేగవంతం చేయాలని ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్.చక్రధరబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం జెన్‌కో, జలవనరుల శాఖ, మేఘా ఇంజినీరింగ్ సంస్థ అధికారులతో ఆయన సమీక్షించారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఉదయం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న చక్రధరబాబు పోలవరం స్పిల్ వే, ఎగువ, దిగువ కాపర్ డ్యాములను పరిశీలించారు. ఆ తరువాత ఫెర్రెల్స్ తయారు చేసే ప్రాంతం పరిశీలించారు. అనంతరం పోలవరం జల విద్యుత్ కేంద్రం ఎగువ ప్రాంతం నుంచి నిర్మాణాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి జల విద్యుత్ కేంద్రం టన్నెల్స్ నుంచి ప్రయాణించి దిగువ ప్రాంతానికి చేరుకుని కోన్, డ్రాఫ్ట్ ట్యూబుల ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి క్రేన్ బాస్కెట్‌లో పోలవరం జల విద్యుత్ కేంద్రం శిఖరాగ్రానికి వెళ్లి పనులను విహంగ వీక్షణం చేశారు. టైల్ రైజ్ ఛానల్‌ను కూడా ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి పోలవరం జల విద్యుత్ కేంద్రంలో జెన్‌కో కోసం నిర్మిస్తున్న కార్యాలయం వద్దకు వెళ్లి మొక్కలు నాటారు. అనంతరం జెన్ కో, ఎంఇఐఎల్ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ ప్రాజెక్ట్ పనులు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్దేశిత లక్ష్యం మేరకు జరుగుతున్నాయని, ఇక నుంచి కూడా అలానే ఒక ప్రణాళిక ప్రకారం పనులు చేసి త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి జెన్ కో, ముఖ్యంగా ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తయ్యి ఉత్పాదన ప్రారంభమైతే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరుతుందని, పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి అవసరమైన మేర విద్యుత్ సరఫరా చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెన్ కో హైడెల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ, హైడల్ ప్రాజెక్ట్స్ సిఇ ఎం.సూరజ్‌కుమార్, సివిల్ విభాగం సిఇ వై.కోటేశ్వరరావు, సిఇ డిజైన్స్ ఎం.రవీంద్ర రెడ్డి, హెచ్‌పిసిఎస్ఇ కె.చంద్రశేఖర్, ఎస్ఇ సివిల్ డి.బాబూరావు, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఇ కె.నరసింహమూర్తి, ఎంఇఐఎల్ వైస్‌ప్రెసిడెంట్ రంగరాజన్, జనరల్ మేనేజర్ శంకర్, డిజి ం క్రాంతి, ఎజిఎం దిలీప్ పాల్గొన్నారు.

రక్తమార్పిడిని పరిశీలిస్తున్న అధికారులు

## తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం పదిమంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల సహకారంతో తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా వ్యాధి చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం తల సేమియా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులకు 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన మానవత సభ్యులు మానేపల్లి సత్యనారాయణ, హేమ సునీత దంపతులకు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేసిన సత్యసాయి సేవా సంస్థకు, లయన్స్ క్లబ్ సభ్యురాలు కె.వద్మావతికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎన్ఆర్‌కె వరప్రసాదరావు, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకర్‌రావు, అజయ్ బాబు పాల్గొన్నారు.

## బయో పెస్టిసైడ్స్‌తో నాణ్యమైన పొగాకు

**జంగారెడ్డి గూడెం:** నాణ్యమైన వర్జీనియా పొగాకు పంట దిగుబడికి బయో పెస్టిసైడ్‌లను రైతులు వినియోగించాలని పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ జి.దామోదర్ సూచించారు. బుధవారం స్థానిక పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులకు బయో పెస్టిసైడ్, ట్రైకోడర్మా, సుడోమొనస్‌ను అయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామోదర్ పొగాకు నారు పెంచడానికి వాడే ట్రేల నాణ్యతను పరిశీలించారు. పొగాకు రైతు మానికల నాగేశ్వరరావు పొలంలో పొగాకు నారుమడులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిటిఆర్ఐ సిఫారసు చేసిన వంగడాలు మాత్రమే పొగాకు నారు మడుళ్లకు, పొగాకు తోటలకు ఉపయోగించాలని సూచించారు. రాబోయే సీజన్‌లో బ్యారన్‌కు 35 క్వింటాళ్ల అనుమతించగా దానికి మించి పొగాకు పండించి, అనధికార బ్యారన్లు నిర్మించిన రైతులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి బి.శ్రీహరి, ఎస్‌జిఒ కె.సుధీర్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

## 'అడ్‌హక్ కమిటీ ఎన్నిక చెల్లదు'

**ఏలూరు టౌన్:** ది ఏలూరు టౌన్ ఆటో మొబైల్ మెకానిక్స్ అసోసియేషన్‌కు నూతనంగా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కొందరు చేస్తున్న దుష్ప్రచారం చట్ట విరుద్ధమని, సంఘంపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని సంఘం మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం చెప్పారు. బుధవారం ఏలూరు రురల్ మండలంలోని మల్కాపురం ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు 15న జరిగిన సర్వసభ్య సమావేశం సందర్భంగా కర్రి నాగేశ్వరావు అనే వ్యక్తి సంఘం మినిట్స్ పుస్తకాన్ని తీసుకుని పారిపోయారన్నారు. దీనిపై అప్పట్లోనే ఏలూరు రురల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. అదే నెల 28న సిఐ వద్దకు పంచాయతీ చేరిందన్నారు. సంఘ నిర్వాహక కమిటీ గడువు గతేడాది జూన్ మూడో తేదీన ముగిసిందని, సభ్యులు సర్వసభ్య సమావేశం ద్వారా 2023 మార్చి 31 వరకూ గడువు పొడిగించారని తెలిపారు. కోర్టు కేసుల వల్ల నూతన కమిటీ నియామకం ఆలస్యమైందని, ఈ నెల 24న ఎన్నికలు నిర్వహించుకుంటామని, ఎన్నికల అధికారిగా కారంశెట్టి రమేష్‌బాబు వ్యవహరిస్తారని, ఈ నెల ఒకటో తేదీన ఏలూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో తెలియజేశామన్నారు. మొత్తం సంఘం ఏర్పాటు సమయానికి 530మంది వరకూ సభ్యులుండగా, 172 మంది కేటాయించిన స్థలాలను ఇతరులకు అమ్మేసుకున్నారని, అందులో 70 మంది చనిపోయారని తెలిపారు. ఇంకా 286 మంది మాత్రమే సభ్యులుగా కొనసాగుతున్నారని చెప్పారు. తమ బైలా ప్రకారం అమ్మేసుకున్న, కొనుక్కున్న వారికి సభ్యులుగా ఉండబోరన్నారు. ఒకవేళ రూ.50 వేలు సభ్యత్వం కడితే కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. అడ్‌హక్ కమిటీ అసలు తమకు తెలియదని, అది చెల్లుబాటు కాదన్నారు. తమకే సభ్యుల మద్దతు ఉందని, త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎమ్‌డి ఖాజా, మానేపల్లి జయకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## జడ్జి హిమబిందుపై ఆరోపణలు తగవు

**మండవల్లి:** బిసి సామాజిక తరగతికి చెందిన మహిళా జడ్జి హిమబిందును అగౌరవపరిచేలా మాట్లాడడం టిడిపి నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగని వరప్రసాద్ విమర్శించారు. చంద్రబాబుకు 14 రోజులు రిమాండ్ విధించడంపై టిడిపి నాయకులు, కార్యకర్తలు మీడియాలో, సోషల్ మీడియాలో జడ్జి హిమబిందుపై చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమబిందుపై బరితెగించి మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. ఇదేనా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలకు ఇచ్చే గౌరవం అని ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానంలో వాదోపవాదాలను విచారించిన తర్వాతే ఆమె చంద్రబాబుకు రిమాండ్ విధించారన్నారు. ఇవన్నీ తెలిసి కూడా తెలుగుదేశం నాయకులు ఆ విధంగా ప్రవర్తించడం సభ్యత కాదన్నారు.

# కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు బుధవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ధర్నాలు, నిరసన దీక్షలు చేపట్టారు.



ఏలూరులో..

**ఏలూరు అర్బన్ :** రానున్న ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేమనే భయంతోనే సిఎం జగన్ టిడిపి అధినేత చంద్రబాబుపైనా, పార్టీ నాయకులపైనా అక్రమ కేసులు పెడుతున్నారని ఏలూరు ఆసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక వసంతమహల్ సెంటర్లో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. తొలుత ఈ దీక్షా శిబిరాన్ని పోలీసులు అడ్డుకుని షామియానాను తొలగించాలని చెప్పటంతో, ఆ పక్కన ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బైఠాయించి తమ నిరసన కొనసాగించారు. అయినప్పటికీ పోలీసులు కొద్దిసేపు సమయం ఇచ్చి దీక్షను ముగించాలని, ప్రభుత్వ స్థలాలలో దీక్ష చేయడానికి అనుమతి లేదని చెప్పటంతో స్థానిక చేపల తూము సెంటర్‌కు చేరుకుని అక్కడ స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన శిబిరంలో తన దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా బడేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమ పాలన సాగుతుందని, సర్వేలన్నీ జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రావడంతో ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచే దమ్ము లేక ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ, నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చాట్రాయి :** చంద్రబాబు అరెస్టే అప్రజాస్వామికం, దారుణమని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. బుధవారం మండలంలోని చనుబండలో మోరంపూడి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరసా శ్రీను, శెట్టి నాగరాజు, ఫిరంగి పుల్లయ్య, మొద్దు శ్రీను, విస్సంపల్లి ప్రసాద్, తేనేటి రాజేంద్ర, రసూల్, చేకు పరమేష్, ధర్మరాజుల వాసు, చంటిబాబు, బజ్జూరి రాజా, మిద్దె చెన్నారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు ఉంగుటూరులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారమూ కొనసాగాయి. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఈ దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలో ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, కైకరం ఎంపిటిసి సభ్యురాలు, పలువురు మహిళలు, నాయకులు కూర్చున్నారు.

**ముసునూరు :** చంద్రబాబు అరెస్టుతో జగన్ పాలన ముగిసినట్లేనని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ముసునూరు సెంటర్‌లో చేపట్టిన రిలేనిరహార దీక్షలో ముద్దరబోయిన మాట్లాడారు.నీ కార్యక్రమంలో గద్దే రఘుబాబు, అట్లూరి రవీంద్ర, కొల్లి గంగారామ్, మెదరమెట్ల సురేంద్ర, చిలుకూరి వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, కాటేపల్లి ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, గద్దల మోహన్‌రావు, పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, రాపర్ల ప్రతాప్, గూడపాటి అజయ్, కందేపు రామగిరి, సూర్యదేవర శ్రీనివాసరావు, మానం గంటేశ్వరరావు, రవీంద్ర, తల్లిబోయిన సత్యనారాయణ, పాకనాటి ఆంజనేయులు, బుజ్జియ్య, గారపాటి నరసింహారావు పాల్గొన్నారు.



ముసునూరులో..

**ద్వారకాతిరుమల :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ద్వారకాతిరుమలలో టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయకుట్రలో భాగంగా చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను ఎదుర్కోలేమనే భయంతో అక్రమ కేసులు బనాయించారన్నారు. ముందస్తు నోటీసు లేకుండా అక్రమంగా అరెస్ట్ చేశారని, తక్షణం ఈ కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, గంటా బాబ్జీ, ఇమ్మడి రత్నాజీ, గంటా నాని, వాసిరెడ్డి ప్రవీణ్‌కుమార్, కొటారు గాంధీ, కూరాకుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జంగారెడ్డి గూడెం :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు చేపట్టిన నిరసన, రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పలువురు రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, బొమ్మాజీ అనిల్, మండవ లక్ష్మణరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎంచే 15న వైద్య విద్యార్థుల తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ నెల 15వ తేదీన సిఎం జగన్ మొదటి ఏడాది మెడికల్ విద్యార్థుల తరగతులను వర్చువల్‌గా ప్రారంభిస్తారని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాట్లను బుధవారం జెసి పరిశీలించారు. కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులతో సిఎం జగన్ విజయనగరం జిల్లాలోని ఓ కార్యక్రమంలో పాల్గొంటారని, మిగిలిన జిల్లాల వారితో వర్చువల్ ద్వారా ఆ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎంపిక చేసిన జిల్లాలకు చెందిన వైద్య విద్యార్థులతో సిఎం ముఖాముఖి సంభాషిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెడికల్ కాలేజీలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. తొలిబ్యాచ్ వైద్య విద్యార్థులతో జెసి ముఖాముఖి సంభాషిస్తూ తొలి బ్యాచ్ తరగతులు సెప్టెంబర్ ఒకటి నుంచి ప్రారంభమయ్యాయన్నారు. కొత్త కాలేజీ, కొత్త వసతి కల్పించడం జరిగిందని, జిజిహెచ్ ప్రిన్సిపల్, ఇతర బోదనా సిబ్బంది నియామకం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతన మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన తరగతిగదులను, పలు విభాగాలను ఆమె పరిశీలించారు. జెసి వెంట ప్రిన్సిపల్ కె.విజయకుమార్, ఆర్‌డిఒ ఎస్‌కె.ఖాజావలి, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, నగరపాల సంస్థ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

## 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఐసిడిఎస్, విద్య తదితర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం జగనన్న సురక్ష తరహాలోనే ఈ ఆరోగ్య సురక్షను కూడా చేపట్టాలన్నారు. ఒక నిర్ణీత రోజున హెల్త్ క్యాంపు నిర్వహించాలన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిలో జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే మనముందున్న కర్తవ్యమన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభించే ఇంటింటి సర్వేను సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. ఎఎన్ఎంలు, సిహెచ్ఒ, ఆశ, వాలంటీర్లు, ప్రతిఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటారని వారికి అవసరమైన ఆరోగ్య సేవలను గుర్తిస్తారని చెప్పారు. ఏడు రకాల పరీక్షలు ఇంటివద్దే చేస్తారన్నారు. వైద్య వివరాలు ప్రత్యేక యాప్‌లో పొందుపరచి కేస్ షీట్లను జనరేట్ చేస్తారన్నారు.

## 1న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

**ఏలూరు అర్బన్:** వచ్చేనెల ఒకటో తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో జరిగిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ జిల్లా సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాలకు విఆర్ఎ స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకూ ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, రెవెన్యూ ఉద్యోగుల ఐక్యత చాటాలని కోరారు. ఈ సమావేశాలకు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్యఅతిథిగా, ప్రధాన అతిథిగా రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ హాజరవుతారని తెలిపారు. మూడు సంవత్సరాలకు జరిగే ఈ కౌన్సిల్ సమావేశాలను 2020లో కరోనా వల్ల జరపలేకపోయామని ఆరు సంవత్సరాల తర్వాత జరిగే ఈ సమావేశాలకు ప్రతి రెవెన్యూ ఉద్యోగి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన : ఆర్‌డిఒ

**ఉంగుటూరు:** పోలింగ్ కేంద్రాల సవరణ ప్రక్రియలో బూత్ లెవిల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాకే పోలింగ్ కేంద్రాల మార్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదుపై పారదర్శకంగా నివేదికలు ఇవ్వాలని ఉంగుటూరు నియోజకవర్గ ఓటర్ల నమ

## విద్యార్థి కుటుంబానికి యుటిఎఫ్ ఆర్థిక సాయం

**ఉంగుటూరు:**బాదంపూడి జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థి కొమ్ము సూర్యతేజ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈక్రమంలో ఉంగుటూరు మండల యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఎంఎల్సి షేక్ సాబ్జి చేతుల మీదుగా బుధవారం అందించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఎంవి.భాస్కరరావు అధ్యక్షత వహించగా, సాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూర్యతేజ అక్క కొమ్ము భూమికకు నగదును అందించి పోస్టాఫీసులలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించనున్నారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆలి, రవికుమార్, నాయకులు శీతాల సత్యనారాయణ, మండల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, జోగినాయుడు, ఉపాధ్యాయులు రాంబాబు, ప్రసాద్, విష్ణు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలి

**భీమడోలు:**రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను అమలు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఎక్కువ దిగుబడులను సాధించవచ్చునని ఏలూరు ఏరువాక కేంద్రానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ నాగేంద్ర తెలిపారు. భీమడోలులో మేలైన యాజమాన్య పద్ధతులతో నిర్వహిస్తున్న పొలంబడి వ్యవసాయ క్షేత్రాలను వారు బుధవారం పరిశీలించారు. రైతులతో మమేకమయ్యారు. అనంతరం వ్యవసాయ అధికారి ఎస్‌పివి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలో పరిసరాల పర్యావరణ విశ్లేషణ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించాలి

**జీలుగుమిల్లి:**మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చూడాలని ఆర్‌డిఒ ఎం.జాన్సీరాణి తెలిపారు. బుధవారం మండలంలోని జీలుగుమిల్లి, దర్భగూడెం పంచాయతీలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల పరిధిలో కనీస వసతులు ఉండేటట్లు చూడాలని సిబ్బందికి ఆదేశించారు. దర్భగూడెంలోని ఆర్‌సిఎం పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలను మూసి వేసి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికి వేరే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో విఆర్ఒ పై మండిపడ్డారు. వెంటనే ప్రత్యామ్నాయం చూడాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు మాధురి, పాషా పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన పంచాయతీ వర్కర్ నాని

**పోలవరం :** రోడ్డుపై రూ.24,500 దొరకగా పంచాయతీ వర్కర్ వారనాని వెంటనే పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్‌కి సమాచారం అందించి యజమానికి అందజేశారు. మండలంలోని ప్రగఢపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ తన బంగారు వస్తువులు తాకట్టు పెట్టి అవసరానికి డబ్బు పొంది బస్సులో పోలవరం నుంచి ప్రయాణిస్తున్న తరుణంలో తన సొమ్ము రూ.24,500 జారవిడుచుకోగా పోలవరం గ్రామం యడ్లగూడెంకు చెందిన పంచాయతీ వర్కర్ వారనాని, సోదరి భవానీకి దొరకాయి. వెంటనే పోలవరం ఎస్ఐ పవన్ కుమార్‌కి సమాచారం అందించి, ఎంక్వైరీ చేయించి ఆ సొమ్మును యాజమానికి అందజేశారు. వీరిని పోలవరం పోలీసులు అభినందించి ప్రశంసించారు.

## 'చిరుధాన్యాలతో ఆరోగ్యం'

**మండవల్లి:**అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను భుజించి ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని సర్పంచి బోయిడి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని లింగాల అంగన్‌వాడీ వన్ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా బాలింతలకు, గర్భవతులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. అంతేకాకుండా ప్రతిఒక్కరూ చిరుధాన్యాలపై అవగాహన పెంచుకొని, భుజించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగి ఉన్న చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణీలలో అనారోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. బాలింతలు, గర్భిణీలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందిపుచ్చుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పవల్లి, ఎఎన్ఎం శైలజ, మహిళా పోలీస్ విజయ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్ల నమోదు

**భీమడోలు:**శ్రీవెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్‌సిసి క్యాడెట్ల నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు ఆయా కళాశాలల ప్రధాన ఆచార్యులు వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ తెలిపారు. ఎన్‌సిసి ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఎన్‌సిసి-19 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన అధికారులు కళాశాల ఆవరణలో దేహదారుఢ్య, రాత పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలకు సుమారు 50 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 20 మంది ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. వీరిలో 8 మంది బాలికలు ఉండటం ఎన్‌సిసిలో ప్రవేశానికి బాలికా విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తే కారణమని వారు అభిప్రాయపడ్డారు. ఎన్‌సిసిలో చేరేందుకు కళాశాలకు సుదూరంలోని ప్రాంతాలకు చెందినవారు ప్రత్యేకంగా వచ్చి విద్యార్థులుగా నమోదు అవుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి విభాగం లెఫ్టెనెంట్ కె.శివశంకర్ పాల్గొని 19వ ఆంధ్రాబెటాలియన్ అధికారులకు సహకరించారు.

## ప్రతిఒక్కరూ హిందీలో ప్రావీణ్యం పొందాలి

**ఏలూరు అర్బన్ :** తెలుగు భాషతో పాటు హిందీ భాషలో కూడా ప్రతి ఒక్కరూ ప్రావీణ్యం కలిగి ఉండాలని విజయవాడ కెబిఎన్ కళాశాల హిందీ అధ్యాపకురాలు కె.జానకి తెలిపారు. ఏలూరు సర్ సిఆర్ఆర్ కళాశాలలో మంగళవారం హిందీ దినోత్స వాన్ని పురస్కరించుకుని ప్రాచ్య భాషా విభాగం వారు నిర్వహించిన 'దొహా మే అభివ్యక్త్ మానవ మూల్య' అనే అంశంపై వక్త జానకి మాట్లాడారు. హిందీ సాహిత్యంలో మానవ విలువలు, నైతిక విలువలు పెంపొందించుకొనే తీరును పద్యాల ద్వారా భావాలతో వివరించారు. సమాజంలో హిందీ భాష వాడుకతో మానవ విలువలు పెరుగుతాయని జానకి తెలిపారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్ విష్ణు మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాచ్య భాష అధ్యక్షులు కెవిఎస్‌పిబి ఆచార్య, హిందీ అధ్యాపకురాలు సుమిత్ర, అధ్యాపకులు బి.వినాయకుడు, డాక్టర్ ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**మండవల్లి:** గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించడంలో కానుకొల్లు పంచాయతీ ముందుంటుందని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. కానుకొల్లులో బిసి, ఎస్‌సి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయన దగ్గరుండి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. అయితే సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆయనను కోరామన్నారు. దీంతో ఆయన స్పందించి రూ.20 లక్షలు మంజూరు చేసి కానుకొల్లు గ్రామ ప్రజలపై ఆయనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఉట్టి మీనా కుమారి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గుంతలతో వాహనదారుల అవస్థలు

గుంతలమయమైన రోడ్డు

# చింతలపూడిలో అధ్వానంగా రోడ్లు

**ప్రజాశక్తి - చింతలపూడి**

**మరమ్మతులైనా చేయాలని ప్రజలు, వాహనదారుల విజ్ఞప్తి**

చింతలపూడిలో యర్రగుంటపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా బోయగూడెం వాటర్ ట్యాంకు నుంచి యర్రగుంటపల్లి వరకూ పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులకు రోడ్డు ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ద్విచక్రవాహనదారులకు, లారీ వాహదారులకు ఇటువైపుగా ప్రయాణించాలంటేనే నానా అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వర్షకాలంలో చిన్న చిన్న గుంతలు కాస్తా ప్రమాదకరంగా పెద్ద గుంతలుగా మారుతున్నాయి. రోజూ ఈ రోడ్డు వెంబడి వందలాదిగా వాహనాలు తిరుగుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ రోడ్లపై దృష్టి పెట్టి కనీసం గుంతలైనా పూడ్చాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.

## సమాచారాన్ని భద్రపరచుకోవాలి

**భీమడోలు:**ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య సమాచారాన్ని, గతంలో తీసుకున్న స్కానింగ్ రిపోర్టులను, వివిధ వైద్య పరీక్షల వివరాలను తమకు ప్రత్యేకించిన డిజిటల్ హెల్త్ ఐడిలో భద్రపరుచుకోవాలని పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ లీలా ప్రసాద్ తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆన్‌లైన్ విధానంలో ఆయుష్మాన్‌భవ్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించిన నేపథ్యంలో ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలలో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు గ్రామ సర్పంచి సుజాత ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పురవీధులలో నిర్వహించిన ర్యాలీలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మాట్లాడుతూ ప్రతీ ఇంటికీ వచ్చి ఆరోగ్య సిబ్బంది కుటుంబీకుల ఆరోగ్య సమాచారం తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి పర్యవేక్షకులు కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇఒపిఆర్‌డిగా లక్ష్మీనారాయణ బాధ్యతలు

**ముదినేపల్లి:**మండల ఇఒపిఆర్‌డిగా దూలం లక్ష్మీనారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామపంచాయతీ గ్రేడ్-1పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## మైనార్టీ సెల్ అధ్యక్షులుగా అన్సారీ బాష

**ద్వారకాతిరుమల:**మండల మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ అన్సారి భాష నియమితులయ్యారు. ఈ సందర్భంగా దేవరపల్లి క్యాంపు కార్యాలయంలో ద్వారకాతిరుమల మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అన్సారి భాష, ఎంఎల్ఎ తలారి వెంకట్రావుని దేవరపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకటకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఆగిరిపల్లి ఇఒపిఆర్‌డిగా శేఖర్

**ఆగిరిపల్లి:**ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్ బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరు గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఉద్యోగోన్నతిపై ఆగిరిపల్లి మండల ఇఒపిఆర్‌డిగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



## వెంకటేశ్వరరావు ఆశయ సాధనకు కృషి : సిపిఎం

**ఆగిరిపల్లి:**పాతూరి వెంకటేశ్వరరావు ఆశయసాధనకు ప్రతి ఒక్క కమ్యూనిస్టు కృషి చేయాలని ఆగిరిపల్లి మండల సిపిఎం కార్యదర్శి చాకిరి శివనాగరాజు తెలిపారు. కామ్రేడ్ పాతూరి వెంకటేశ్వరరావు 8వ వర్ధంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. పాతూరి వెంకటేశ్వరరావు స్మారకస్థూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

## అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

**టి.నరసాపురం:**మండలంలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ముందుగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యుల వివరాలు పోలీసు స్టేషన్‌లో తెలిపాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విగ్రహాల వివరాలు తెలిపాలన్నారు.

## ముగిసిన క్రీడా పోటీలు

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలులో ఆటల పోటీల్లో ప్రతిభ కనబరస్తున్న క్రీడాకారులు

భీమడోలు హైస్కూల్ వేదికగా గత రెండు రోజులుగా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, గేమ్స్ మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. తొలిరోజైనా మంగళవారం క్రీడా పోటీలను భీమడోలు మండల విద్యాధికారి ఇ.శ్రీనివాస్‌రావుతో పాటు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలి రోజు నిర్వహించిన పోటీల్లో భాగంగా వాలీబాల్, కబడ్డీ, త్రో బాల్, షటిల్ గేమ్స్‌తో పాటు యోగా అంశం ఆధారంగా పోటీలు నిర్వహించారు. రెండవ రోజైనా బుధవారం రన్నింగ్, జంపింగ్, త్రో బాల్‌తో పాటు, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలను నిర్వహించారు. స్పోర్ట్స్‌లో, గేమ్స్ విభాగంలో వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి త్వరలో ఉంగుటూరు మండలంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి కనబరిచి, పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఏ విధమైన రవాణా చెల్లింపులు ఇవ్వలేదు. ఇదేవిధంగా ఆటల మధ్య విరామ సమయంలో క్రీడాకారులు సేద తీరేందుకు సైతం సౌకర్యాలు లేకపోయాయి. భీమడోలు హైస్కూల్ యాజమాన్యం మధ్యాహ్న భోజనం పథకం ద్వారా భోజనాన్ని సమకూర్చారు. దీనితో అధిక శాతం క్రీడాకారులు వ్యక్తిగతంగా భరించగా, కొంతమంది క్రీడాకారులకు రవాణా ఛార్జీలను తాము సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండలానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్లు డి.శేఖర్, ఎన్.ప్రసాద్, కృష్ణారావు, ప్రమీల, రాహుల్ పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మండల స్థాయి సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, త్రోబాల్, షాట్‌పుట్, బాలురు, బాలికల విభాగంలో అండర్-14, అండర్-17 కేటగిరీలలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో మండల కోఆర్డినేటర్ ఎంబిఎఎల్ నారాయణ, మండలంలోని వివిధ పాఠశాలల పిడిలు, ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో రోడ్లను నిర్మించాలి : పిడిఎస్‌యు

**బుట్టాయగూడెం:** ఏజెన్సీలో పాడైపోయిన రోడ్లను తక్షణమే నిర్మించి, రోడ్లకు పైన ప్రవహిస్తున్న కొండవాగులపై ఎత్తైన బ్రిడ్జిలు నిర్మించాలని ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో కెఆర్ పురం ఐటిడిఎ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కార్యదర్శి, సహాయ కార్యదర్శి గురుగుంట్ల ప్రసాద్ రెడ్డి, తగరం బాబురావు మాట్లాడుతూ టిడిపి హయాంలో రోడ్ల దుస్థితి ఏవిధంగా వుందో, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రోడ్ల పరిస్థితి మెరుగుపడలేదన్నారు. ప్రజలు ఈ రోడ్లపై ప్రయాణించడానికి బ.్యం.బ్రాంతులకు గురవుతున్నారన్నారు. రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని చిందర వందరగా పాడైపోయి, పెద్ద పెద్ద గోతులతో ఉన్నాయన్నారు. వర్షం వస్తే నీరు గోతులలో చేరి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఏజెన్సీలో ఆదివాసీ గ్రామాలకు వెళ్లే రోడ్లు రోడ్లకుపైన ప్రవహిస్తున్న కొండవాగులు ఉధృతికి గతంలో నిర్మించిన సపటాలు, వంతెనలు పూర్తిగా పాడై పోయాయన్నారు. బుట్టాయగూడెం నుంచి కొన్ని గిరిజన గ్రామాల ప్రజలు జంగారెడ్డిగూడెం, ఆస్పత్రులకు, కోర్టులకు, ఆఫీసులో పనిమీద వెళ్లాలన్నా జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టిసపాలెం గ్రామం దగ్గర జల్లేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం వస్తే జల్లేరు వాగు పొంగి పట్టిసపాలెం దగ్గర ఎంతోమంది ప్రజలు వాగులో కొట్టుకుపోయి, ప్రాణాలు విడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇటు పోలవరం ఎంఎల్ఎ, అటు చింతలపూడి ఎంఎల్ఎ స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో**
**ఓ.యస్. నెం. 223/2023**

బిట్వీన్ :
మీగడ సరోజిని, భర్త: వెంకటేశ్వరరావు ...వాది
మరియు
శేకుబోయిన నాగమణి (రాణి) మరియు అదర్స్ .... ప్రతివాదులు

**To, 3వ ప్రతివాది :**

శేకుబోయిన అను, తండ్రి : (లేటు) శ్రీనివాసరావు, 2వ ఫ్లోర్, రెడ్డిగారి బిల్డింగ్, పాశం పుల్లమ్మ నాంచారయ్య గార్ల నిలయం ప్రక్కన, పోస్టల్ కాలనీ, ఫైర్ స్టేషన్ వెనుక, కైకలూరు - 521333, కృష్ణాజిల్లా. (ప్రస్తుతం ఏలూరు జిల్లా.)

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 29-09-2023న వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించ బడునని యిందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 29-09-2023

మచిలీపట్నం
ది.7-9-2023

**లంకిశెట్టి బాలాజీ**
**వాది తరపున న్యాయవాది.**

**వేలం ప్రకటన**

**In the Court of Addl. Senior Civil Judge Court, Eluru**
**E.P. 5/2022 in O.S. 115/2017**

*Between:*
మాధన సాయిరామ్ ...DHr
AND
బొర్రా సత్యవతి వగైరాలు ...JDrs

**వాది తరపున దాఖలు చేసిన వేలం ప్రకటన**

పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ దాఖలా 1 నుండి 3 వారలకు చెందిన స్థిరాస్తి షాపు **ది. 4-10-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** నుండి పై కోర్టులో వేలం జరుపబడును. గాన ఆసక్తి కలిగిన వారు తమ యొక్క ఆధార్ కార్డుతో మరియు అఫిడవిట్‌తో సహా వేలంలో పాల్గొనవచ్చునని తెలియపరచడమైనది.

**షెడ్యూలు**

ప॥గో॥జిల్లా, ఏలూరు కార్పొరేషన్, ఏలూరు 1 టౌన్ మెయిన్ బజార్, పాత P/C (10/C) Ward, 7th డివిజన్, డోర్ నంబర్ 8-9-10, extent చ॥గ॥ 4.6లు స్థలము, అందలి పెంకు కప్పు గల షాపునకు హద్దులు.

**తూర్పు:** సూన్యం.
**దక్షిణం:** మార్కెట్‌కు వెళ్ళే మెయిన్ రోడ్.
**పడమర:** మెయిన్ బజార్.
**ఉత్తరం:** బొర్రా కోటేశ్వరరావు షాపు.

ఈ సరిహద్దుల మధ్య గల చ॥గ॥ 4.6లు స్థలం, అందలి పెంకుటి కప్పు షాపు, అందలి అన్ని తలుపులు, ద్వారబంధములు మరియు అన్ని ఈజిమెంటు హక్కులతో సహా.

***DHr విలువ: రూ. 1,50,000/-లు***
***గవర్నమెంటు వారి విలువ చ॥గ॥ రూ. 43,000/-లు***

**V.V.BADARI NARAYANA**
Advocate, Eluru
Cell: 9440596191
Eluru
13-9-2023

**క్రెడిటార్ I.P. నోటీసు**

**మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**I.P. 17/2020**

మధ్య:
పిల్లి రవీంద్ర జీవన్‌కుమార్ -పిటీషనరు
AND
1. నాగళ్ళ విఠల్‌కుమార్ (డైడ్)
2. కాళ్ళ ధనంజయరావు
3. ది ఆఫీషియల్ రిశీవరు, ప॥గో॥జిల్లా, ఏలూరు
4. నాగళ్ళ ప్రవీణ
5. నాగళ్ళ చంద్ర
6. నాగళ్ళ సంధ్యారాణి ...రెస్పాండెంట్సు

టు:

***R-4:*** నాగళ్ళ ప్రవీణ, W/o. లేటు విఠల్‌కుమార్, డో.నెం. 17-277/1, ఫ్లాట్ నెం. 501, రక్షిత రెసిడెన్సీ, కె.కె.రాజు గ్రీన్‌సిటీ, వెంకటాపురం పంచాయతి, ఏలూరు మండలం, ఏలూరు, ఏలూరు జిల్లా.

***R-5:*** నాగళ్ళ చంద్ర, S/o. లేటు విఠల్‌కుమార్, డో.నెం. 17-277/1, ఫ్లాట్ నెం. 501, రక్షిత రెసిడెన్సీ, కె.కె.రాజు గ్రీన్‌సిటీ, వెంకటాపురం పంచాయతి, ఏలూరు మండలం, ఏలూరు, ఏలూరు జిల్లా.

***R-6:*** నాగళ్ళ సంధ్యారాణి, D/o. లేటు విఠల్‌కుమార్, డో.నెం. 17-277/1, ఫ్లాట్ నెం. 501, రక్షిత రెసిడెన్సీ, కె.కె.రాజు గ్రీన్‌సిటీ, వెంకటాపురం పంచాయతి, ఏలూరు మండలం, ఏలూరు, ఏలూరు జిల్లా.

మిమ్ములను ఇన్‌సాల్వెంట్‌లుగా డిక్లేర్ చేయమని కోరుచూ ఇందలి పిటీషనర్‌చే దాఖలు చేయబడ్డ పై I.P. గ్రంధము ది. 08-09-2023న శ్రీ కోర్టు వారు జారీ చేసిన ఉత్తర్వుల ననుసరించి ది. 09-10-2023కు వాయిదా అయివున్నందున **ది. 09-10-2023న ఉదయం 10 గంటలకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని జిల్లా కోర్టు ప్రాంగణములో గల జిల్లా లీగల్ సర్వీసెస్ వారి సహాయం పొంది గాని హాజరు కావలసి యున్నది. అట్లు కాని యెడల పై దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానించుట జరుగునని మీరు ఇందుమూలముగా తెలుసుకోగలరు.

**శియ్యాద్రి జగదీశ్వరరావు**
అడ్వకేటు, ఏలూరు
సెల్: 8956899999
ఏలూరు
ది.11-09-2023

## నూతన పింఛన్లు అందజేత

**పోలవరం:**కొత్త పట్టిసీమ గ్రామ సచివాలయంలో నూతనంగా 44 మందికి పింఛన్లు మంజూరయ్యాయని సర్పంచి మైగాపుల విజయదుర్గ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు జిల్లా ఎంపీపీ సంఘాల అధ్యక్షులు పోలవరం ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి చేతుల మీదుగా నూతన పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వలవల వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**టి.నరసాపురం:**ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌సి కాలనీ వాసులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. సమస్యలపై ఆయన స్పందించి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు, ఎంపీపీ పాల్గొన్నారు.

**ముదినేపల్లి:**పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని అర్హులైన 21 మందికి పింఛన్లు అందజేశారు. తొలుత పౌష్టికాహార వారోత్సవాలు సందర్భంగా అంబేద్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు గ్రామ సర్పంచి కైకమ్మ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు జంపాన కోటయ్య, మరీదు నాగయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:**మండలంలోని శ్రీనివాసపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం శ్రీనివాసపురం సచివాలయంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి, సర్పంచి యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచి శ్రీనివాసరావు, ఎంపిటిసి జజ్జువరపు తాతారావు, వైసిపి నాయకు